# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 10 హైదరాబాదు అక్టోబరు, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 10 Hyderabad October, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



*BHAGAVAN SRI RAMANA MAHARSHI*



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామ్బు తజలధి యరుణాచ లమిది ॥

| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| అక్టోబర్ 2025 | October 2025 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 134వ ప్రవచనం** | రామదాస్ మూర్తి | 3 |
| **2** | **వి. కామేశ్వర రావు** | సరోజా ప్రసాద్ | 10 |
| **3.** | **కె.ఆర్.కె. మూర్తి** | రవికృష్ణ శర్మ | 19 |
| **4.** | **భగవాన్ భక్తులు - గోవులు** | రమేష్ బాబు | 24 |
| **5.** | **అనుస్మరణీయులు శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు** | | 28 |
| 6. | "I am Nobody's Guru" | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 41 | V Krithivasan | 42 |
| 8. | Story of Gomai: Embodiment of Pure Love and Devotion | Madhusudhanan S | 46 |


**Events in Sri Ramana Kendram in October 2025**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 14th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు, e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# జరామరణాలు అనివార్యాలు

డా॥ కే.యస్. గారి 134వ ప్రవచనం

అనువాదం: రామదాస్ మూర్తి

మనం ఈ లోకాన్ని వీడి వెళ్లే ఆఖరి క్షణంలో భగవంతుడిని స్మరిస్తే, స్వర్గానికి వెళ్తామని తెలిపే కథలు ఎన్నో ఉన్నాయి. వాటిని చదివినప్పుడు, అది సులభమనిపిస్తుంది. కానీ నిజానికి, మనకందరికీ తెలిసినట్లు, వివిధ భయాల కారణంగా, చాలా కొద్ది మంది మాత్రమే మరణ భయం లేకుండా ఉండగలరు. ఖచ్చితంగా తెలిసిన విషయం ఏమిటంటే, జన్మించిన ప్రతి ఒక్కరికీ, మరణం ఉంటుంది. మిగతా అన్ని విషయాల యథార్థత మనకు తెలియదు. ఏది ఎప్పుడు జరుగుతుందో మనం చెప్పలేము. మరణ భయం లేకుండా ఉండడం ఎంతో అసాధారణమైన విషయం. కొందరు మాత్రం మరణ భయాన్ని జయించారు.

పరీక్షిత్తు సాధారణ వ్యక్తి కాదు. అసలు ఆయన పుట్టుకే అసాధారణమైనది. ఒక రోజు అశ్వత్థామ పరీక్షిత్తు తల్లి గర్భం పై ఒక బాణాన్ని వదిలినప్పుడు, ఆ బాణం యొక్క అత్యంత శక్తి వల్ల మరణించిన శిశువు జన్మించబోతుందని తెలిసింది. గర్భాన్ని ఆ బాణం తగలక ముందు శ్రీకృష్ణుడు అందులోకి ప్రవేశించి, ఆ బాణం యొక్క శక్తి శిశువు పై పెద్దగా ప్రభావం చూపకుండునట్లు చేశాడు. కృష్ణుని స్పర్శ కారణంగా శిశువు ప్రమాదం నుండి తప్పించు కొనడం జరిగింది. ఇది పరీక్షిత్తు యొక్క వృత్తాంతం.

ఒకసారి పరీక్షిత్తు అడవిలో క్రూర జంతువులను వేటాడటం కొరకు వెళ్లి అలసిపోవడంతో దాహం వేసింది. అదే క్షణంలో అక్కడ తీవ్ర తపస్సులో మునిగి ఉన్న శమీక ముని తారసపడ్డాడు. తన దాహం తీర్చమని అడిగిన పరీక్షిత్తుకు ముని జవాబివ్వలేదు. తనపట్ల ముని మర్యాదపూర్వకంగా ప్రవర్తించలేదన్న భావనతో పరీక్షిత్తు ఒక చనిపోయిన పాముని ముని మెడలో వేసి వెళ్ళిపోయాడు.

**కోపం ప్రమాదకరం**

కోపంగా ఉన్న వ్యక్తి అలా ప్రవర్తిస్తాడు. పరీక్షిత్తు అసాధారణ వ్యక్తి అయినప్పటికీ, పట్టరాని కోపంతో ఏమి చేస్తున్నదీ ఆలోచించ కుండా, పాముని అలా ముని మెడలో వేశాడు. కాసేపటి తర్వాత తీవ్రమైన దైవ ధ్యానంలో తపస్సు చేసి అక్కడికి వచ్చిన ముని కుమారుడు జరిగినది చూసి ఎవరికీ అపకారం చేయని తన తండ్రికి అలా జరిగినందుకు కోపంతో తన తండ్రిని అలా అవమాన పరచిన వ్యక్తి ఏడు రోజుల లోపు చనిపోతాడని శపించాడు. దాదాపు అదే సమయంలో తన తపస్సు నుండి మేల్కొన్న ముని, శాపం గురించి కుమారుడి ద్వారా తెలుసుకుని చాలా కలవరం చెందాడు. రాజు మంచితనానికి ఎంతో పేరు పొందినవాడు, అలా ప్రవర్తించడానికి ఏదో కారణం ఉండి ఉంటుందని అన్నాడు. అలా చేసి ఉండ కూడదని కుమారుని మందలించాడు.

ఆ తరువాత ముని పరీక్షిత్తుకు వార్త పంపుతూ ఏమి జరిగిందో చెబుతూ గొప్ప వ్యక్తి యొక్క శాపం వృథా కాదని, రాజు ఏడు రోజుల్లో మరణించడం తథ్యమని కూడా తెలిపాడు. విషయాన్ని తెలుసుకున్న పరీక్షిత్తు తాను చేసిన అపచారానికి చింతిస్తున్నాను అన్నాడు. కృష్ణుని కృప అమితంగా పొంది ఉన్నందున తన మరణం గురించి అతను దిగులు చెందలేదు. కృష్ణుని దయతోనే ఈ విషయం తెలిసింది. మరణం కోసం తాను సిద్ధంగా ఉండాలని భావించాడు. ఆ ఏడు రోజులు ఉపయోగకరంగా గడపాలని నిశ్చయించుకున్నాడు. మంత్రివర్గాన్ని పిలిపించుకున్న పరీక్షిత్తు వారితో చేయవలసిన కార్యం ఏమిటని సంప్రదింపులు జరిపాడు. అటు తరువాత తన కుమారుడైన జనమేజయుని పట్టాభిషిక్తుని చేసి గంగ ఒడ్డున ప్రాయోపవేశం చేద్దామని నిశ్చయించుకున్నాడు. అదే సమయంలో మానవాళిలో అతి గొప్ప వ్యక్తి శుక బ్రహ్మ మహర్షి దయచేశాడు. ఆ మహర్షి పుట్టుకతోనే సంసారాన్ని త్యజించినవాడు. ఆత్మసాక్షాత్కారం పొందిన వాడు. శుకుడు భిక్ష కోసం ఏ గృహం వద్ద కూడా కొన్ని క్షణాల కంటే ఎక్కువ సేపు కాచుకునేవాడు కాదు. పరీక్షిత్తు మోక్షాన్ని పొందటానికి మార్గమేమిటని గంగ ఒడ్డున ఉన్న మహాత్ములతో సంప్రదింపులు జరుపుతున్న సమయంలో అక్కడికి శుకుని రాక భగవంతుని కృపగా భావించిన పరీక్షిత్తు తన పరిస్థితి వివరించి చేయవలసింది ఏమిటో తెలుపమన్నాడు.

## శుకుడు చెప్పిన పరిష్కారం

తాను ఆ సమయంలో అక్కడికి రావడం తన అదృష్టంగా కూడా భావిస్తున్నానని అంటూ, సకల అవతారాల గురించి ముఖ్యంగా శ్రీకృష్ణ అవతారాన్ని గురించి వివరిస్తాను అన్నాడు. అలాగ పరీక్షిత్తు మిగిలిన కాలాన్ని ఉపయోగకరంగా గడిపినట్లుగా అవుతుందని తాను అక్కడే ఉండిపోయాడు.

ఏడు రోజులపాటు పరీక్షిత్తు భాగవతం వింటూ గడిపాడు. ఆ మాత్రం చేత పరీక్షిత్తు మరణాన్ని పొందలేదని కాదు. కానీ అతని మరణం తీరు చెప్పుకోదగినది. భాగవతాన్ని శుక మహర్షి ద్వారా వింటూ ఉండడం ఎంతో అదృష్టమని భావించాడు. ప్రత్యేకించి తన జీవితకాలం మొత్తం కృష్ణుని స్మరిస్తూ ఉన్న కారణంగానే కృష్ణుడు ఆ సమయానికి శుకుడు అక్కడే ఉండేటట్టు ఏర్పాటు చేశాడు. చాలామంది ఆఖరి క్షణాలలో తమ లౌకిక పరమైన అంశాల పరిష్కారం కోసం సమయాన్ని వెచ్చిస్తారు.

చివరి కాలంలో మన ఆలోచనా సరళి మనం జీవించినంత కాలం భగవంతుని స్మరించిన దాన్ని బట్టి ఉంటుంది. జీవితం అలా గడపాలని అనుకుంటాం. కానీ, లౌకిక ఒత్తిడిలు మనమీద అమిత ప్రభావం చూపుతుంటాయి. మన దగ్గరి వారి గురించిన ఆలోచనలు, వాళ్ళు తన తర్వాత ఒంటరి వారవుతారన్న బెంగలు, ఇవన్నీ కొన్ని రోజులు లేదా కొన్ని నెలలపాటు కూడా నడుస్తుంటాయి. జనం అసలు ఎందుకు బాధలుపడుతూ ఉండాలి

అనిపిస్తుంది. అకాల మరణాలు అనుకునే ఇలాంటి ప్రశ్నలకు జవాబు ఉండదు కానీ ఇది నియతి...

## పాత దానికి బదులు క్రొత్తది

భగవద్గీతలో శ్రీకృష్ణుడు **"వాసాంసి జీర్ణాని యథా విహాయ.... దేహీ"** అని అన్నాడు. చదవడానికి బాగుండవచ్చు కానీ ఆ అవస్థలో ఉన్న వ్యక్తికి ఇది భరించరానిది. మన పాత దుస్తులను పారవేసి క్రొత్త వాటిని ధరించినట్లే శరీరం తన పాత శరీరాన్ని రాల్చి క్రొత్త శరీరాన్ని ఏర్పరచుకుంటుంది అని శ్రీకృష్ణుడు గీతలో తెలిపాడు. ఈ భావన మానసికంగా తృప్తిని ఇవ్వచ్చునేమో కానీ వ్యక్తికి బాధాకరంగా ఉండవచ్చు. దేవునిపై గాఢ నమ్మకం ఉన్నప్పుడే కొంత వరకు తట్టుకోగలరు. కానీ గీతలో చెప్పినట్లు ఎవరూ దీని నుండి తప్పించుకోలేరు. పరీక్షిత్తుకు కూడా అదే జరిగింది. కానీ ప్రకృతి సిద్ధంగా అతని యొక్క నిరంతర దైవచింతన వల్ల తనకు మరణం తప్పదు అన్న నిశ్చితభావం సహజంగానే కలిగింది.

యుధిష్ఠిరుని యక్షుడు అడిగిన ప్రశ్నల్లో ఈ ప్రపంచంలో అత్యాశ్చర్యకరమైన విషయం ఏమిటి అన్నది ఒకటి. దానికి జవాబుగా యుధిష్టరుడు **"అహన్యహాని భూతాన్ని గచ్ఛయంతి..... ఆశ్చర్యం అతః పరం"** అన్నట్లు మనం ఎన్నో పక్షులు, జంతువులు, ఎందరో మనుషులు యముని దగ్గరికి వెళుతూన్నది గమనిస్తున్నప్పటికీ, జీవించి ఉన్నవారు తాము మరణించమని లేదా ఎంతో కాలం జీవిస్తూనే శాశ్వతంగా ఈ లోకంలోనే ఉండిపోతామని

భావిస్తూ ఉంటారు. సగటు మనిషి మరణం అంటే భయపడుతూ ఉంటాడు. కానీ మరణాతీతుడైన మహేశ్వరుని ప్రార్థించే వారికి మరణ భయం ఉండదు. దానికి ఈశ్వర కృప అవసరం. ఇది ఏదో మేధోపరమైన జ్ఞానం కాదు. మనం ఏమి చేశామన్నది ముఖ్యం. పూజ, జపం, ధ్యానం మొదలైనవి మనం ఈ ప్రపంచాన్ని సరిగా అవగాహన చేసుకునేందుకు సహాయపడతాయి.

## జరా మరణాలు అనివార్యాలు

అగస్త్యుడు శ్రీరామునికి ఆదిత్య హృదయం బోధించినప్పుడు ఆయన మరణ భయం నుండి విముక్తుడయ్యాడు. బుద్ధుడు పలు శవాలను చూస్తూ ఉన్నప్పుడు అది అతనిపై తీవ్రమైన ప్రభావం చూపింది. వయసైన వారు, మరణించిన వారి శవాలను చూసినప్పుడు ఎంతో చలించి పోతారు. జరా మరణాల దృశ్యాల ప్రభావంతో బాధపడిన బుద్ధుడు పరిష్కారం కోసం తపస్సు చేశాడు. శరీరం ఎప్పటికీ అలాగే ఉండలేదు. **పంచత్వం గతః** అంటే అర్థం ఏమిటి? మరణం అని అర్థం. శరీరం తన ఉనికికి కారణమైన పంచభూతాలలో లీనమవుతుంది. శరీరం లేకపోయినప్పటికీ, మరేదో ఎప్పటికీ ఉండిపోతుంది అని భగవాన్ చెప్పారు. అందుకే "నేను పోతున్నాను అని మీరు అంటారు, కాని 'నేను' ఎక్కడికి వెళతాను? నేను ఇక్కడే ఉంటాను" అని అన్నారు. ఆత్మకు మరణం లేదు. వేదాలు, ఉపనిషత్తులు ఈ విషయాన్ని ప్రబోధిస్తున్నాయి.

**"అసతోమా సద్గమయా తమసోమా జ్యోతిర్గమయా మృత్యోర్మా అమృతంగమయ"** -- మరణం నుండి అమృతత్వాన్ని సాధిస్తాము. శరీర స్పృహ నశించినప్పుడు అమృతత్వాన్ని పొందవచ్చు. ధ్యానం, పూజ చేస్తూ ఉండడం శరీర స్పృహ నాశనానికి సహాయకారిగా ఉంటాయి.

**"తత్రాపి దప్రహం...... - యః పరస్స మహేశ్వరః"** - మహేశ్వరుడు మరణాతీతుడు, శాశ్వతుడు. మన లోపలే కొలువైన మహేశ్వరుని నిరంతరం ధ్యానిస్తే మరణ భయం ఉండదు. అందరూ మరణిస్తారు, కానీ నిత్యమైన ఆత్మకు మరణం లేదు. ఇదేదో ఆషామాషీగా చెప్పే విషయం కాదు. అది మనం జీవించి ఉన్నప్పుడు, శరీరం రాలిపోయిన తర్వాత కూడా ఉండేది. అది నియతి. అప్పుడప్పుడు మనం జబ్బున పడతాం. కోలుకున్నప్పుడు దైవకృప అంటాము. అది నిజమే, కానీ ఏదో రోజున కోలుకోలేము. అంటే భగవంతుడు అప్పుడు దయామయుడు కాదని అంటామా? కాదు, మన జీవితాన్ని ఎప్పుడు చాలింప చేయాలో భగవంతుడికి తెలుసు. అది నిశ్చయింపబడినది. శాశ్వతంగా ఉంటామని, దీవెన ఉన్నప్పుడే భగవంతుడు గొప్పవాడని భావిస్తే అది తప్పు. జీవితాన్ని ఎలా ఆస్వాదిస్తున్నామో అలాగే మరణాన్ని ఆహ్వానించడం నేర్చుకోవాలి. భగవంతుని కృప ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది.

******

# భగవాన్ నా జీవితంలోకి ఎలా వచ్చారు?

## వి. కామేశ్వర రావు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ Fragrant Petals లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

చాలా ఏళ్ళ క్రితం ఒక రాత్రి నాకొక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో ఒక వృద్ధుడు దయాపూరితమైన చిరునవ్వుతో నన్ను ఆశీర్వదించి తన వద్దకు రమ్మన్నట్లుగా సంజ్ఞ చేశాడు. తెల్లవారేసరికి ఆ స్వప్నం కరిగిపోయి నేను నా దినచర్యలో పడ్డాను. వంటిట్లోకి వెళ్లి నా అనుభవాన్ని నా భార్యతో పంచుకొన్నాను. కాని స్వప్నంలో కనబడిన ఆ మహాత్ముడెవరో గుర్తుపట్టలేకపోయాను. నేను చదివిన ఆత్మ సాక్షాత్కారం అనే పుస్తకంలో శ్రీ రమణ మహర్షి గురించి ఉన్నది. నాకు స్వప్నంలో కనిపించింది బహుశా వారు కాదు కదా? తరచు శ్రీ రమణాశ్రమానికి వెళ్తూ ఉండే మిత్రుడొకరిని తనతో పాటు నన్ను కూడా తీసుకు వెళ్ళమని అడిగాను. అతను ఒప్పుకోవడమే కాదు, అదే రోజు బయలుదేరాము ఇద్దరమూ. మరుసటి ఉదయానికల్లా తిరువణ్ణామలై చేరాము.

ఆశ్రమం ప్రశాంతంగా కనిపించింది. కొన్ని కాటేజీలు, ఒక ధ్యానమందిరం ఉన్నాయి. మేము నేరుగా హాలులోకి వెళ్ళాము. నాకు స్వప్నంలో దర్శనమిచ్చిన మహర్షి కౌపీనధారియై సోఫాలో ఆసీనులై ఉన్నారు. నాకు భగవంతుని సన్నిధిలో ఉన్న భావన కలిగింది. భగవాన్‌కు సాష్టాంగ ప్రణామం చేశాను. భగవాన్‌కు

ఇరువైపులా పురుషులు, స్త్రీలు కూర్చుని ఉన్నారు. వారికి సమీపాన గడ్డంతో ఉన్న ఒక పెద్దాయన పుస్తకం కుడుతున్నారు. “కాఫీ త్రాగావా?” అని నన్ను అడిగారు భగవాన్. దానితో బయటికి వెళ్లి స్నానం చేసి అల్పాహారం తీసుకున్నాను. మళ్ళీ హాలులోకి వెళ్లే సరికి భగవానే తామే స్వయంగా పుస్తకం కుడుతున్నారు. వారు ఈ పని చేయడం దేనికి? అనిపించింది. అయితే వారు ఎంత శ్రద్ధగా జాగ్రత్తగా ఆ పని చేస్తున్నారో గమనించాను. అంతేకాదు ఎలా చెయ్యాలో ఆ గడ్డం వ్యక్తికి నేర్పుతున్నారు. అది బోధిస్తుంటే భగవంతుడంటేనే ఇలా దోషరహితుడు పరిపూర్ణుడు కదా అనిపించింది. అతి సూక్ష్మ విషయాల పట్ల కూడా అత్యంత శ్రద్ధ కనపరుస్తాడు సుమా అనుకున్నాను.

మేము మధ్యాహ్న భోజనానికి వెళ్లేసరికి భగవాన్ ఎదురుగా భక్తులు ఇటూ, అటూ కూర్చుని ఉన్నారు. కుడివైపు బ్రాహ్మణులు, ఎడమవైపు బ్రాహ్మణేతరులు, హైందవేతరులు కూర్చున్నారు. అన్నం సరిగ్గా ఉడకలేదని వడ్డించే వ్యక్తితో భగవాన్ చెప్పడం విన్నాను. వారికి వంట బాగా వచ్చునని, ఆశ్రమం వంటశాలలో తరచు సహాయం చేస్తుంటారని చెప్పారు.

ప్రభుత్వోద్యోగంలో భాగంగా నేను రెండోభాష పరీక్ష వ్రాయ వలసి ఉన్నది. పరీక్షకు ఎంతో సమయం లేదు. తమిళం నాకు పెద్దగా రాకపోయినా, ఆ భాషలోనే పరీక్ష వ్రాయాలని నిశ్చయించు కున్నాను. ఆ విషయమై ఎంతో కొంత ఆందోళన ఉండడంతో, పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం భగవాన్ ఆశీస్సులు పొందాలనుకుంటు

న్నట్లు ఇంకొక భక్తుడితో చెప్పాను. అతడు ఆ సాయంకాలం నన్ను భగవాన్ వద్దకు తీసుకువెళ్ళాడు. నేను సాష్టాంగ నమస్కారం చేసి భగవాన్‌కు నా సమస్యను విన్నవించాను. భగవాన్ ఆశీస్సులు కోరగానే వారు "ఫర్వాలేదులే" అన్నారు. నాకు చాలా సంతోషం కలిగింది. "నేనెవరు?" అనే చిన్న పుస్తకం ఇంగ్లీషు, తమిళం, నా మాతృభాష తెలుగు - మూడు భాషలలో ఉన్నది. తమిళ సాధకుడి సహాయంతో తమిళ పుస్తకం చదవమని సలహా ఇచ్చారు.

మరుసటి రోజు పెందలాడే లేచాను. ఎప్పుడెప్పుడు తెల్లవారు తుందా, ఆశ్రమం పుస్తక విక్రయశాలలో పుస్తకాలెప్పుడు కొందామా అని ఆత్రుతగా ఎదురుచూశాను.ఆ ముందు రాత్రి కూడా స్వప్నంలో భగవాన్ దర్శనమైంది.

నేను బసచేసిన కాటేజి ప్రక్క నుండి భగవాన్ వెళ్ళడం చూసి నేను ఒక్క ఉదుటున బయటకు వెళ్లి, భగవాన్ ముందు సాగిలపడ్డాను. ఆశ్రమం నుండి తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాను. "వెళుదువు గాని ఏమంత తొందర" అని అన్నారు. భగవాన్ ఆ మాట అన్నాక ఇక ఆ రోజు వెళ్ళడం సాధ్యమవుతుందా అని నా మిత్రుడు సంశయించాడు. కాని, నేను వెళ్ళక తప్పదు మరి. మేము పుస్తకాలు కొనుక్కున్న తరువాత ఆశ్రమం వారి ఎడ్ల బండీలో రైల్వేస్టేషన్‌కు వెళ్ళాము. తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది రెండు రోజుల పాటు రైల్వే సమ్మె అని. చేసేదేమి లేక తిరిగి ఆశ్రమానికి వెళ్లి ఇలా జరిగిందని భగవాన్‌కు తెలిపాము. వారు చిరునవ్వు నవ్వారు. రెండు రోజులు గడిచాక మళ్ళీ భగవాన్ వద్దకు వెళ్లి

తిరుగు ప్రయాణానికి అనుమతి కోరాము. ''మంచిది'' అని అన్నారు. ఈసారి మా సామానులు బండిలో పెట్టి స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్ళాము. తీరా మేము స్టేషన్‌కు చేరేసరికి రైలు అప్పటికే ప్లాట్ ఫారం మీదకు వచ్చి ఉన్నది. మా సామానుల బండీయో ఇంకా రాలేదు. ఇక రైలు తప్పిపోయినట్లే అనుకున్నాము. అయితే భగవాన్ అనుమతి లభించింది కదా, రైలును ఎలాగైనా ఆపి ప్రయాణం చేసి తీరాలనిపించింది. స్టేషన్ మాష్టరు వద్దకు వెళ్లి అయ్యా మేము రైలు ఎక్కేందుకు రావడం ఇది రెండవసారి. కాస్త మా సామానుల బండీ వచ్చేవరకు రైలు ఆపగలరా అని కోరాను. ఆయన సరే నన్నాడు! ఎలాగైతేనేమి రైలు ఎక్కగలిగాము. రైలు కదిలిన తరువాత జరిగినదంతా పునరాలోచించాను. భగవాన్ ''ఎందుకు తొందర'' అన్నప్పుడు నేను ఎంత ప్రయత్నించినా బయలుదేరలేకపోయాను. వారి అనుమతి లభించిన తరువాత నా కోసం రైలు ఆపి మరీ ఎక్కించారు! రెండు పర్యాయాలూ వారు చెప్పినట్లే జరిగింది. నాకు తమిళం ఏ మాత్రం రాకపోయినా ధైర్యం చెప్పి పరీక్షలో కృతార్థుడినవుతానని ఆశీర్వదించారు. వారు చెప్పారు కాని తమిళ బోధకుడిని పెట్టుకోవలసిన అవసరం లేదనుకున్నాను. కాని నా అనుభవం చూస్తే భగవాన్ అన్న మాటల్లా జరిగి తీరుతోందే? నా ప్రయాణమే అందుకు నిదర్శనం. ఇల్లు చేరాక ఒక తమిళ బోధకుడిని పెట్టుకుని కోర్టు వేసవి సెలవుల్లో ఇంట్లో ఉండి ''నేనెవరు?'' తమిళ పుస్తకం చదువుతూ గడిపాను. పరీక్ష రానే వచ్చింది. అందులో ఒక ఇంగ్లీషు ప్రసంగాన్ని

తమిళంలోకి అనువదించాలి. ఈ వ్రాత పరీక్షలో ఎలాగోలా ఉత్తీర్ణుడనయ్యాను. తరువాత మద్రాస్‌లో మౌఖిక పరీక్ష అన్నారు. నాకు దడ పుట్టింది. అయితే భగవాన్ అనుగ్రహంతో అది కూడా సులభంగానే గట్టెక్కాను.

నేను తమిళనాడులో ఉద్యోగం చేసే అవకాశమే లేదు కనుక, ఈ తమిళ భాషా పరీక్ష నిష్ప్రయోజనం అని ఒక వంక అనిపించినా, భగవాన్ పట్ల నా విశ్వాసం బలపడటానికి ఇదొక తార్కాణం అని కూడా అనిపించింది. నా స్థాయిలో నా అనుభవం మేరకు భగవాన్‌ను బేరీజు వేయగలిగాను.

1949 ఫిబ్రవరిలో నా పెద్ద కుమారుడికి తీవ్రంగా మశూచి సోకింది. కొన్ని రోజులు గడిచేసరికి డాక్టర్ చెప్పాడు, ఈ మశూచి సోకినవారు చాలామంది చనిపోతున్నారని, మీ అబ్బాయి కోలుకోవడం కూడా కష్టమని, దీనితో నేను అన్ని ఆశలు వదిలివేసి, పిల్లవాడి ప్రక్కనే ఉంటూ, భక్తి రచనలు, పద్యాలు చదివి వినిపించే వాడిని. ఆ దశలో ఫిబ్రవరి 4న స్ఫురించింది, ఈ ఆపత్సమయంలో భగవాన్ ఆశీస్సుల కోసం ప్రార్థించాలని. జాప్యం చేయకుండా వారికో లేఖ వ్రాశానిలా - ప్రియమైన భగవాన్, బాధలో ఉన్న ఈ బిడ్డను, తల్లితండ్రులను కనికరించి ఆశీర్వదించగలరు. సదా మీ పాదసేవలో వి. కామేశ్వరరావు.

నాతోపాటు పిల్లవాడికి రాత్రిపూట తోడుగా ఉంటున్న నా చెల్లెలు మరుసటిరోజు చెప్పింది, రాత్రి తనకు ఒక స్వప్నం వచ్చిందని, ఆ స్వప్నంలో అమ్మవారు (అంటే మశూచి) మా ఇంటి

నుండి వెళ్ళిపోతూ పిల్లవాడిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పిందట. దాని అర్థం పిల్లవాడు ఇక కోలుకుంటాడని, ఇంట్లో మరెవరికీ కూడా, ఇక మశూచి రాదనీ ఆమె చెప్పింది. మరికొద్దిసేపటి తరువాత ఒక స్నేహితుడు వచ్చి శ్రీ రమణాశ్రమం నుండి తెచ్చిన విభూతి ఇచ్చి వెళ్ళాడు. ఇది ఇంకొక మంచి శకునం. మాలో ఆశ చిగురించింది. ఫిబ్రవరి 8న ఆశ్రమం నుండి ఈ ఉత్తరం వచ్చింది, "ప్రియమైన కామేశ్వరరావు గారికి, మీరు 4న వ్రాసిన జాబు భగవాన్ చదివారు. మశూచితో బాధపడుతున్న మీ అబ్బాయి కోసం భగవాన్ ఆశీస్సులతో విభూతి ప్రసాదం పంపుతున్నాము. శ్రీ భగవాన్, భక్తులు కుశలం - ఇట్లు సర్వాధికారి తరపున వెంకట రామన్".

ఈ ఉత్తరం చదివి నాకు ఒడలు పులకరించింది. మా అబ్బాయికి మశూచి అని భగవాన్‌కు ఎలా తెలిసింది? వారికి ఎలా తెలిసిందో నాకెలా తెలుస్తుంది? ఏదైతేనేమి, మా అబ్బాయి బ్రతికాడు, ఆరోగ్యంగా కూడా ఉన్నాడు.

భగవాన్‌కు ఈ విషయం ఎలా తెలిసిందన్న ఉత్కంఠ నన్ను వెంటాడింది. నా జాబు చూడగానే వారికి మశూచితో మంచం పట్టిన పిల్లవాడు మనస్సులో గోచరించాడని ఆశ్రమంలో పెద్దలు చెప్పారు. అయితే తరువాత తెనాలి వాస్తవ్యులు శ్రీ భాగవతుల అన్నపూర్ణయ్య శాస్త్రి చెప్పిన వివరణ సంతృప్తికరంగా అనిపించింది. "మీ ఇంట్లో పరిస్థితి ఏమిటో నువ్వు వ్రాస్తే కాని భగవాన్‌కు తెలియదనుకున్నావా? వారు సర్వాంతర్యామి. సకలమూ తెలిసిన వారు. అయితే మనం అర్థించేవరకు వారు జోక్యం చేసుకోరు.

ఒకరు బొంబాయిలో కచేరీ చేస్తున్నాడనుకో, అది నువ్వు వినాలంటే, రేడియో పెట్టుకోవాలి. లేకపోతే అతను పాడుతున్నా నువ్వు వినలేవు కదా.... అలాగే నీకు భగవాన్ ఆశీరనుగ్రహం కావాలంటే వారిని సరైన మార్గంలో సంప్రదించాలి'' అన్నారు శాస్త్రి గారు.

ఈ అనుభవంతో భగవాన్ పట్ల నా భక్తి ఇనుమడించింది. ఎందుకంటే, చావు బ్రతుకుల మధ్య ఉన్న నా కుమారుడికి వారు ప్రాణభిక్ష పెట్టారు.

1949 మార్చి 17న ఆశ్రమంలో భగవాన్ తల్లిగారి సమాధిపై నిర్మించిన మాతృ భూతేశ్వర ఆలయ కుంభాభిషేకం జరిగింది. మా అమ్మగారిని తీసుకొని కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని నిశ్చయించుకున్నాను. రెండు రోజులు సెలవుపెట్టి అన్ని ఏర్పాట్లు చేసుకొని, మధ్యాహ్నం రెండింటికి ఇంటికి వచ్చాను. మమ్మల్ని స్టేషన్ తీసుకు వెళ్లేందుకు వాకిట్లో కారు కూడా వచ్చి ఉన్నది. అయితే అకస్మాత్తుగా ఎందుకనో నేను తిరువణ్ణామలైకి బయలుదేరకూడదని అనిపించింది. దీనితో మా అమ్మకు, నా భార్యకు కోపం వచ్చింది. అయినా సరే వద్దనుకున్నాను. కారులో పెట్టిన సామాను దించేశారు. అందరికీ కోపం వచ్చిందని తెలిసి కూడా ''ఈ కార్యక్రమానికి నేను రాకూడదని భగవాన్ ఉద్దేశ్యంలా ఉన్నది. నాకు బాధగానే ఉన్నది కాని, నేనేం చెయ్యలేను'' అని సర్ది చెప్పాను.

ఆ రాత్రి 9 గంటలకు టెలిగ్రామ్ వచ్చింది. మా మూడో చెల్లెలి ఏకైక కుమారుడు మెదడు వాపు వ్యాధితో చావు బ్రతుకుల మధ్య

ఉన్నాడని, తక్షణం అమ్మను అక్కడికి పంపాలని అందులో వ్రాసి ఉన్నది. మా అబ్బాయికి మశూచి సోకినప్పుడు సపర్యలు చేసిన సోదరిని తోడు ఇచ్చి, మా అమ్మను వెను వెంటనే రైలు ఎక్కించాను. అక్కడికి చేరగానే నా సోదరి జాబు వ్రాసింది. మా మేనల్లుడి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉన్నదని, వాడిని కాపాడగలిగింది భగవాన్ ఆశీస్సులు మాత్రమేనని. దానితో మార్చి 30న నేను మళ్ళీ ఆశ్రమానికి జాబు వ్రాశాను. మరుసటి రోజు తేదీతో నాకు జవాబు వచ్చింది. "మీరు 30న వ్రాసిన జాబును భగవాన్‌కు నివేదించాము. ఆ పిల్లవాడికి, తల్లిదండ్రులకు భగవాన్ ఆశీస్సులు లభించుగాక! ప్రసాదం పంపుతున్నాము" - ఇదీ ఆ ఉత్తరం.

నా మేనల్లుడు కోలుకున్నాడు. తిరువణ్ణామలైకి మా ప్రయాణం అకస్మాత్తుగా ఎందుకు రద్దు చేసుకున్నామో అప్పుడు అర్థమయింది. అక్కడికే గనుక వెళ్ళి ఉంటే, మా చెల్లెలు పంపిన టెలిగ్రామ్ మాకు చేరేది కాదు. సకాలంలో మా అమ్మ, సోదరి అక్కడికి వెళ్ళగలిగేవారు కాదు, నేను భగవాన్ ఆశీస్సుల కోసం లేఖ వ్రాసేవాడనీ కాదు!

1950లో భగవాన్ తమ శరీరాన్ని విడిచి వెళ్ళిన సంవత్సరం. భౌతికంగా, వారు మన మధ్య లేకున్నా మన హృదయాల్లో సదా కొలువై ఉన్నారు. నా మాదిరి భగవాన్ అపార అనుగ్రహానికి పాత్రులైన వేలాది భక్తులున్నారు. ఆ అనుగ్రహానికి ప్రతిఫలంగా వారి నుండి భగవాన్ ఏమీ ఆశించలేదు. ఆ భగవంతుడు మనుషుల భౌతిక అవసరాలు ఎందుకు తీరుస్తాడంటే వారిలో ఆధ్యాత్మిక

జిజ్ఞాస కలిగించేందుకు. సహాయం పొందడం మరచిపోవడం మానవ నైజమైతే, చేయూత నిచ్చి మన్నించడం భగవంతుని స్వభావం.

పసిబిడ్డ అవసరాలను తీర్చే తండ్రి మాదిరిగా, ఆ పరమేశ్వరుడు మనిషి తాత్కాలిక అవసరాలను తీర్చి ఆదుకుంటాడు. పర్యవసానంగా పరమాత్మ సాక్షాత్కారానికై ఆ మనిషి ఆరాటపడేలా చేస్తాడు.

సాయిబాబా గురించి ఆర్థర్ ఆస్ బోర్న్ ఇలా వ్రాశాడు. బాబా అనేవారట "ప్రజలు ఏమి కోరుకుంటారో అది అనుగ్రహిస్తాను. చివరికి నేనేది అనుగ్రహిస్తానో అదే వారు కోరుకుంటారని నా ఆశ" అని.

******

# ప్రేమతో కూడిన భక్తి

## టి.పి.ఆర్. (టి.పి. రామచంద్ర అయ్యర్)

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం

అనువాదకులు: రవికృష్ణ శర్మ

మేజర్ చాడ్విక్ ఒకసారి ఎలా వ్యూహ రచన చేసి, శ్రీ భగవాన్‌ను ఔషదం తీసుకునేలా ప్రేరేపించారో అందుకు సంబంధించిన సంఘటనను పాత భక్తులు ఒకరు ఎంతో రమణీయంగా వర్ణించారు.

అది 1940వ దశకము ప్రారంభములో జరిగింది. శ్రీ భగవాన్ శరీరంలో జాండిస్ సంబంధితమైన లక్షణాలు చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్లుగా పొడచూపసాగాయి. ఔషదాన్ని నిరాకరిస్తూ ఉండడం వలన, దానికి అనుగుణంగా వారు రోజు రోజుకీ బలహీనపడడం జరుగుతున్నది. భక్తులు వారిని ఏదైనా చికిత్స తీసుకొనమని ప్రాధేయపడ్డా ఉపయోగం లేకుండా పోయింది. మాలో కొంత మంది ప్రార్థనలు చేశాము, మరి కొంత మంది భగవాన్ కూర్చునే హాలు చుట్టూ మౌనంగా ప్రదక్షిణలు చేస్తున్నారు. శ్రీ భగవాన్‌ను ఔషధం తీసుకొనమని వేడుకుంటున్న వాళ్లలో మేజర్ చాడ్విక్ ప్రధానమైనవారు.

ఒకరోజున నేను మద్రాస్‌లో ఉన్న ఇంటి నుండి ఆఫీసుకి బయలుదేరుదామని అనుకుంటున్న సమయంలో పోస్ట్‌మాన్ వచ్చి ఒక ఉత్తరాన్ని నా చేతిలో పెట్టాడు. అది మేజర్ చాడ్విక్ నుండి

వచ్చింది. నాకు గుర్తున్న వరకు ఆ ఉత్తరంలో ఇలా వ్రాసి ఉన్నది - "ప్రియమైన టి.పి.ఆర్. శ్రీ భగవాన్ ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తూ ఉన్నది అని తెలియజేయుటకు చింతిస్తున్నాను. అలానే, ఆరోగ్యం మెరుగు పరచుకోవటానికి వారు ఏమీ చేయడం లేదు. వారు ఎటువంటి ఔషదమూ స్వీకరించటం లేదు. మా వినతులను మరియు ఒప్పించే ప్రయత్నాలను మన్నించడం లేదు. దానిని చూడడం చాలా కష్టంగా ఉన్నది. ఇవాళ నాకొక ఆలోచన వచ్చింది. శ్రీ భగవాన్ ఔషదాలు పుచ్చుకోవటానికి నిరాకరిస్తారని మీకూ తెలుసు. కాని, అదే సమయంలో ఆయుర్వేదానికి సంబంధించిన ఎటువంటి లేహ్యమును ఇచ్చినా ప్రీతితో స్వీకరిస్తారు. కాబట్టి, మీరు ఏదో ఒక ఆయుర్వేద నిపుణుడి వద్దకో లేక ఆయుర్వేద అంగడికో వెళ్లి, రోగి లక్షణాలను తెలిపి లేహ్యాన్ని తీసుకుని వారికి (ఆశ్రమానికి) పంపకూడదా? మీరు చేసిన పుణ్య కర్మ వల్ల వారు ఆ లేహ్యాన్ని ప్రీతితో తీసుకోవచ్చునేమో! కాని, నేను మీకు ఉత్తరాన్ని వ్రాసినట్లు లేదా వారిని గురించి నేను చింతిస్తున్నాను అని గాని వారికి తెలియకూడదు. మీరు ఏమి చెప్పవచ్చు అంటే, ఒకసారి మీరు అనుకోకుండా ఒకరిని కలిశారని, మాటలలో భాగంగా వారు లేహ్యము ఒకటి బాగా తయారు చేశారని, అది ఎన్నో విధాల ఆరోగ్యానికి మంచి చేస్తుందని, అది టానిక్‌లా స్వీకరించవచ్చునని, ఔషదం కాదని చెప్పారని, ఇలా ఏదో ఒకటి చెప్పండి. మీ వద్ద నుండి వెంటనే ప్రత్యుత్తరాన్ని ఆశిస్తున్నాను".

ఆ ఉత్తరం చదివిన వెంటనే నేను కోర్టుకు వెళ్ళకుండా ముందుగా మైలాపూరులో ఉన్న వెంకటరమణ చికిత్సాలయము

నకు వెళ్లి, అక్కడ పనిచేస్తున్న ఒక సీనియర్ వైద్యుడిని కలిసి, రోగి లక్షణాలను తెలిపి, రోగి ఎవరు అనే విషయాన్ని గోప్యంగా ఉంచి, ఏది రోగికి ఉపయుక్తమైనదో తెలియజేయవలసినదిగా అభ్యర్థించాను. దానికి ఆ వైద్యుడు పరిశీలించటానికి రోగిని చికిత్సాలయానికి తీసుకురాగలరా అని అడిగారు. రోగి వయస్సు పెద్దదవటం మరియు ఇతర కారణాల వలన, నేను రోగిని తీసుకు రాలేనని ఆ వైద్యునికి చెప్పాను. అప్పుడు ఆ వైద్యుడు రెండు పదార్థాలను తెలియజేసి వాటిని ఉపయోగించడంలో పాటించ వలసిన నియమాలను సూచించారు. అందులో ఒకటి, ఒకరకమైన నూనె, రెండవది జిరగ విల్వాడి అనే లేహ్యాము. శ్రీ భగవాన్ సాధారణంగా ఎటువంటి నూనెలను లోపలకు పుచ్చుకోరని తెలుసు కనుక, దానిని ప్రక్కన పెట్టి, ఒక పౌండు లేహ్యామును తీసుకుని నా కార్యాలయానికి వెళ్లాను. కొంత భాగాన్ని నా వద్ద ఉంచుకొని, మిగిలిన భాగాన్ని ప్యాక్ చేసి అప్పటి సర్వాధికారి శ్రీ నిరంజనానంద స్వామికి పంపుతూ, ఒక ఉత్తరాన్ని కూడా అందు జత చేయడం జరిగినది. ఆ ఉత్తరంలో "ప్రియమైన శ్రీ చిన్న స్వామిగళ్, ఈ రోజు మైలాపూరు నుండి వెళ్తూ ఉన్నప్పుడు వెంకటరమణ చికిత్సాలయంలోనికి తొంగి చూడడం జరిగింది. అందులో ఒక క్రొత్త లేహ్యాము జిరగ విల్వాడి అనేది తయారు చేయబడి, అమ్మకానికి పెట్టడం జరిగినది. నాకు కొనాలనిపించి దానిని తీసుకున్నాను. అది మధురంగాను మరియు బాగుగా నున్నది. దానిలో కొంత భాగము నేను తీసుకుని మిగిలిన భాగాన్ని మీకు పంపుతున్నాను. దానిని శ్రీ భగవాన్ వద్దకు ఇతర ప్రసాదాలతో

పాటుగా తీసుకు వెళ్లి వారి ముందు ఉంచండి. అది ఔషదం కాదు. అయితే, అందరూ సాధారణంగా ఉపయోగించే ఒకరకమైన బలవర్ధకమైన టానిక్'' అని వ్రాయడం జరిగినది. శ్రీ చిన్నస్వామి, నేను వ్రాసిన విధంగానే ఆ లేహ్యాన్ని మరియు ఉత్తరాన్ని శ్రీ భగవాన్ ముందర ఉంచడం జరిగినదని అనుకుంటున్నాను.

ఆ వారాంతానికే నేను యథా ప్రకారం తిరువణ్ణామలై వెళ్ళడం జరిగినది. ఆశ్రమానికి వెళ్లి హాలులో సోఫాలో కూర్చుని ఉన్న శ్రీ భగవాన్‌కు సాష్టాంగ దండ ప్రణామములు అర్పించి పైకి లేచినప్పుడు, శ్రీ భగవాన్ నా వైపు ముఖం త్రిప్పి చిన్న జాడీని చూపిస్తూ ''చూడండి! ఇది మీరు పంపించిన లేహ్యము. దీనిని నేను రోజుకు నాలుగుసార్లు ఉపయోగిస్తున్నాను. జీలకఱ్ఱ మరియు బిల్వము పైత్యానికి చాలా మంచిది,'' అని వాటి గుణాలను ఇంకా ఏవేవో చెప్పారు. ఆ మాటలకు నేనెంతో ఉప్పొంగిపోయాను. మరియు చాడ్విక్ వ్యూహము ఫలించినదని సంతోషించి, వెళ్లి శ్రీ భగవాన్ ఎదురుగా కూర్చున్నాను. ఒక అర్థ నిమిషంలో శ్రీ భగవాన్, ''ఏమిటి? దీనిని పంపమని ఎవరైనా మీకు ఉత్తరము వ్రాశారా?'' అని అడిగారు. నేను వెంటనే ఒప్పుకుని ఇలా అన్నాను: ''అవును భగవాన్, నేను ఏదైతే ఉత్తరంలో వ్రాశానో, ఆ విషయము అంతా, చాడ్విక్ నాకు ఉత్తరం ద్వారా తెలియజేశారు. నా ఆశ మరియు కోరిక కూడా అదే అవడం వలన, చాడ్విక్ చెప్పినట్లుగా విధేయతతో తను (చాడ్విక్) వ్రాసిన ఉత్తర విషయము గురించి చిన్న స్వామికి కూడా తెలియజెప్పకుండా, నేనే ఇదంతా ప్రారంభించినట్లు

వ్రాశాను''. అది విని శ్రీ భగవాన్ అనుగ్రహపూర్వకంగా నవ్వుతూ "అది చూడండి, అది చూడండి'' అని అన్నారు.

ఆ రోజు సాయంత్రము నాలుగు గంటలకు చాడ్విక్ యథావిధిగా హాలులోకి ప్రతిరోజు వచ్చిన విధంగానే అంతర్ముఖుడై ఉండి ఉప్పొంగిన హృదయంతో, సంతోషంతో లోపలికి వచ్చారు. దండ ప్రణామాలు అర్పించి లేచారో లేదో అప్పుడు శ్రీ భగవాన్ వారితో "చాడ్విక్! మీరు ఏమన్నా వ్రాశారా?'' అని అడిగారు. దానితో ఒక్కసారిగా షాక్‌కు గురై ఆశ్చర్యం వ్యక్తం చేశారు చాడ్విక్. ఇదంతా తాను శ్రీ భగవాన్ యందు కల అమితమైన ప్రేమ మరియు భక్తి చేత చేశారు కనుక, సంతోషంతో "అవును భగవాన్, నేను టి.పి.ఆర్. గారికి ఈ విషయాన్నంతా వ్రాశాను. మేమేమి చేయగలం? శ్రీ భగవాన్ ఏమీ తీసుకోరు, రోజు రోజుకీ చిక్కిపోతుండడం భక్తుల మయిన మేము చూడలేకపోతున్నాము, మాకు అది ఆశనిపాతంగా ఉంటున్నది. అందువల్ల నేనే ఇదంతా చేశాను. నేనిప్పుడు ఎంతో ఆనందంగా ఉన్నాను'' అని అన్నారు.

అలా చెప్పి తాను ప్రతిరోజు కూర్చునే ప్రదేశానికి వెళ్లి కూర్చుని యథావిధిగా ధ్యానం చేసుకోవడం మొదలుపెట్టారు. అటువంటి భక్తి మరియు ప్రేమ చాడ్విక్‌కు శ్రీ భగవాన్ యందు ఉండెడిది. ఎంతో మంది పాత భక్తులలో వీరు ఒకరు. శ్రీ భగవాన్ యందు వారికి గల భక్తి అనన్య సామాన్యమైనట్టిది మరియు అనంతమైనది.

******

## అధ్యాయము - 5

# భగవాన్ భక్తులు - కోతులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 5వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

(గత సంచికకు కొనసాగింపు) **రమేష్ బాబు**

భగవాన్ అక్కడ మండుతున్న పొయ్యినుండి కొంత విభూతి తీసి వారికిచ్చారు. ఆ కుటుంబం వారంతా ఎంతో సంతోషంతో భగవాన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఇంటికి వెళ్ళారు. బాధపడు తున్న రోగికి ఆ విభూతి ప్రసాదం ఇచ్చారు. ఆ విభూతి మహిమ తలుచుకున్న ముస్లిం కాంట్రాక్టరు కొద్ది రోజులలోనే కోలుకొని మామూలు మనిషి అయ్యాడు. కాంట్రాక్టరు కుటుంబమంతా భగవాన్ విభూతి అంటే ఎంతో విశ్వాసం. ఆ విభూతి వలననే కోలుకున్నారని ఆ కుటుంబమంతా భగవాన్ పట్ల ఎంతో నమ్మకంగా, వినయంగా ఉన్నారు. కోతుల పట్ల ముస్లిం కాంట్రాక్టరు కొంత దయగా వ్యవహరించాడు. ఆ కుటుంబం అంతా చివరి రోజుల వరకూ భగవాన్ భక్తులుగా ఉన్నారు.

### అద్భుత విభూతి మహిమ

చిత్తురు జిల్లా నివాసి శ్రీరామలింగ స్వామి. ఆయనకు వివాహ మైన తరువాత మూడు నెలల్లోనే కుష్ఠువ్యాధి వచ్చింది. ఎన్ని మందులు వాడినా గుణం కనబడలేదు. నరకయాతన అనుభవి స్తున్నారు. భార్యను కూడా కన్నెత్తి చూడలేని పరిస్థితి. జీవితం దుర్భరమైంది. ఒక మిత్రుడు తిరువణ్ణామలైలో విభూతి స్వామి

అని ఒక స్వామి ఉన్నారు. ఆయన విభూతినిస్తారు. దాంతో నీ జబ్బు నయమైపోతుంది అని చెప్పాడు. ఎంతో కష్టపడి తిరువణ్ణామలై వెళ్తే ఆ స్వామి పచ్చి మోసగాడు అని తెలిసింది. ఏమి చెయ్యాలో పాలుపోలేదు. దుఃఖం ముంచుకు వచ్చింది. జీవితం మీద విరక్తి కలిగింది. ఏమి చెయ్యలేక అలానే కూర్చుని ఉంటే ఒక అపరిచిత వ్యక్తి వచ్చారు. ఎందుకంత దుఃఖం. ఇక్కడ శ్రీ రమణాశ్రమంలో ఒక మహానుభావులున్నారు. వారు నీ రోగం నయం చేస్తారు, వెళ్ళు అని చెప్పారు.

శ్రీ రామలింగ స్వామిలో క్రొత్త ఆశలు చిగురించాయి. అప్పటి వరకు శ్రీ రమణులు ఎవరో, శ్రీ రమణాశ్రమం ఎక్కడో, ఏమీ తెలియని వ్యక్తి ఎవరో వచ్చి చెబితే తిన్నగా వారినీ వీరిని అడిగి శ్రీ రమణాశ్రమానికి వెళ్ళారు. అప్పుడు భగవాన్ రమణులు హాలులో సోఫామీద కూర్చుని అరుణాచలం కొండని అర్థ నిమీలిత నేత్రాలతో చూస్తున్నారు.

ఆశ్రమవాసులు వీరి రోగాన్ని చూచి హాలులోకి వెళ్ళడానికి ససేమిరా అంగీకరించలేదు. ఏమి చేయాలో తోచక తన దురదృష్టాన్ని నిందించుకుంటూ హాలు బయట కిటికీ ప్రక్కన నిలబడ్డాడు. ఎప్పటికైనా భగవాన్ తనని చూడకపోతారా? అన్న భావముతో. కొంత సమయం గడిచింది. అదృష్టవశాత్తు భగవాన్ రామలింగస్వామిని చూచారు.

కన్నీరు కారుస్తూ దీనంగా నిలబడిన వ్యక్తి కంటబడ్డారు. ఒక్క క్షణం చూశారు. లోపలికి రమ్మని సైగ చేశారు. తిన్నగా లోపలకి

వెళ్లి వారికెదురుగా నిలబడి తన కథంతా చెప్పుకున్నారు. ఎంతో కరుణతో కథంతా విని వారి కెదురుగా టేబిల్ మీద గిన్నెలో ఉన్న విభూతిని తీసుకోమన్నారు. శ్రీ రామలింగ స్వామి విభూతి తీసుకున్నారు. రమణుల వారికి కన్నీటితో కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు తీసుకున్నారు.

ఇంటికి వెళ్ళిన తరువాత రోజూ భగవాన్ ని స్మరిస్తూ విభూతిని రాసుకునేవారు. మూడు నెలల్లో జబ్బు పూర్తిగా నయమైపోయింది. అందరిలో ఒక మనిషిగా తిరగగలిగారు. భగవాన్ ఋణాన్ని ఎలాగూ తీర్చుకోలేను. ఆ మహనీయుని లీలను ఇతరులతో పంచు కోగలను. అంతే, అంటారు రామలింగస్వామి.

### 4. వృద్ధ వానర రాజు సమాధి

ఒక వానర రాజు సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. అది తన తెగలోని ఇద్దరు తీవ్రవాదులైన మగకోతులను బహిష్కరించి చక్కగా పాలన సాగించింది. కొంతకాలం గడిచింది.

ఒకరోజు ఉదయం విరూపాక్ష గుహ సమీపంలో ఒక ముసలి కోతి చావుకు దగ్గరలో ఉన్నది అని భగవాన్‌తో చెప్పారు. భగవాన్ ఆ కోతిని చూడడానికి వెళ్ళారు. అది ఇంతకు ముందు చెప్పిన సాహసియైన వానరరాజు. దానిని ఆశ్రమానికి తెచ్చారు. భగవాన్ దానిని తన తొడపై పెట్టుకున్నారు. ఆ తీవ్రవాదులైన రెండు కోతులు దగ్గరగా ఉన్న చెట్ల మీద నుండి గమనిస్తున్నాయి. భగవాన్ తన శరీరాన్ని కొంత కదిలించారు. ఆ కదలికతో కోతిరాజు తన

సహజమైన ప్రవృత్తితో భగవాన్ కాలును కరిచింది. నా శరీరం మీద ఈ కోతిరాజుల అనుగ్రహం వలన ఇలాంటివి నాలుగు గుర్తులున్నాయి అని భగవాన్ చెప్పారు.

ముసలివానరరాజు ఒక మూలుగు మూలిగి తన ప్రాణం విడిచారు. గమనిస్తున్న రెండు మగ కోతులు చెట్ల మీద పైకి క్రిందికి దుముకుతూ ఎంతో తీవ్రమైన దుఃఖాన్ని ప్రకటించాయి.

భగవాన్ ఆ వానరరాజు శవాన్ని పాలతో స్నానం చేయించారు. తరువాత నీటితో స్నానం చేయించారు. వానరరాజు శరీరమంతా విభూతి పూయబడింది. దానికి కొత్తబట్ట కట్టారు. ముఖానికి ఏ ఆచ్ఛాదనా లేకుండా ఉంచారు. దాని ముందు భారీగా కర్పూరం వెలిగించారు. వృద్ధ వానర రాజుకు ఒక సన్న్యాసికి జరిపినట్లు ఎంతో గౌరవ పురస్సరంగా కార్యక్రమాలు నిర్వర్తించి విరూపాక్ష గుహ దగ్గరలో సమాధి చేశారు. సమాధిమీద శిలాఫలకం ఏర్పాటు చేశారు.

(సశేషం)

## అనుస్మరణీయులు - శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు

(గత సంచిక తరువాయి)

వారి శ్రీమతి రాధమ్మ గారితో మరియు వారి కొడుకులు, కూతుర్లతో పిల్లలకు చదువులు చెప్పించి, వారికి కూడా ప్రతి నెలా జీతం చెల్లించేవారు. వారి శ్రీమతి నాకెందుకు జీతం చెల్లిస్తున్నా రంటే - 'మీకంటూ ఏమన్నా ఖర్చులు వుంటే నన్ను అడగటానికి మీరు ఇబ్బంది పడవచ్చు. నేను వద్దనవచ్చు. ఆ భావన ఎందుకు కలగాలి?' అని అనేవారట. అలానే ప్రతి నెలా సిబ్బందితో మీటింగ్ పెట్టి పిల్లలను ఎట్టి పరిస్థితిలోనూ తిట్టవద్దని చెప్తూ ఉండేవారు. తల్లితండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి పిల్లలను ఎలా చూసుకోవాలో హితబోధ చేసేవారు. పిల్లలకు ఎగ్జామ్స్ 9 గంటలకు అయిపోతే, 9.01 నిమిషాలకు పిల్లల పేపర్లు దిద్దటం మొదలు పెట్టించేవారు. ప్రతి క్లాస్‌కు ఒక చార్ట్‌ను ఏర్పాటు చేసి, ఆ క్లాసులో ఎవరికి మంచి మార్కులొచ్చాయో, ఎవరికి రాలేదో ఆ చార్ట్ ద్వారా తెలియచేసేవారు. నేనొకసారి 'ఎందుకండీ ఇవన్నీ తయారు చేస్తున్నారు?' అని అడిగితే, వారు నాతో ఇలా చెప్పారు - 'భగవద్గీతలో **యోగః కర్మసు కౌశలం** అని చెప్పారు. దానినే నేను ఆచరిస్తున్నాను' అన్నారు.

సుబ్బారావు గారికి దేని యందు మోహము ఉండేది కాదు. దేన్నైనా ఎంత నిష్ఠతో పట్టుకొంటారో అంతే తేలికగా దాన్ని వదిలి పెట్టేవారు కూడా. వదిలి వేసిన బాధ కూడా ఉండేది కాదు వారికి. ఎవరినైనా మళ్ళీ మళ్ళీ కలవాలనే కోరిక కూడా ఉండేది కాదు. వారు ఎల్లవేళలా అవతలి వ్యక్తి యొక్క మనస్తత్వాన్ని బట్టి వారి స్థాయికి దిగివచ్చి మాట్లాడేవారు. చిన్న పిల్లలతో చిన్నపిల్లవానివలె, యువకులతో యువకుని వలే, ఆధ్యాత్మికంగా ఉత్తమ స్థితిలో

ఉన్న వారితో ఆ స్థాయిలోనే మాట్లాడేవారు. దాంతో ప్రతీ ఒక్కరూ సుబ్బారావు గారు తమకే అత్యంత ఆత్మీయులు అని అనుకొనేవారు. కొంతమంది వారిని గురువుగా స్వీకరించేవారు.

వారు ఆంతరంగికంగా చాలా లోతైన దృష్టి కలిగిన వారు. వారి హృదయం ఎల్లవేళలా ఉరకలు వేసే ఉత్సాహంతో ఉండేది. వారెంతో దయార్ద్ర హృదయులు. జిల్లెళ్ళమూడి అమ్మవారు ఇలా అనేవారు. "నాకు మంచితనాన్ని చూస్తే ఏడుపొస్తుంది. ఎలాగ అంటే మేఘానికి చల్లగాలి తగిలితే ఎలా వర్షిస్తుందో అలా మంచి తనాన్ని చూస్తే నా కంటి వెంట కన్నీరు కారుతుంది". ఈ స్వభావాన్ని మనము సుబ్బారావు గారిలో కూడా చూడవచ్చు. నేను చిన్నప్పుడు జిల్లెళ్ళమూడి అమ్మ వద్దనే పెరిగాను. జిల్లెళ్ళమూడి అమ్మవారు శరీరాన్ని వదిలి వేశారనే వార్తను రేడియోలో వినగానే సుబ్బారావు గారి కంటి వెంట అప్రయత్నంగా కన్నీరు బొట బొటా కారింది. వారు అమ్మను ఒక్కసారి మాత్రమే దర్శించుకొన్నారు. ఒకసారి వారితో తెలిసినవాళ్ళు ఒకరు - 'ఫలానా వారి ఇంట్లో సరుకులు నిండుకొన్నాయి. ఏ దుకాణంలో ఐతే వారు అప్పుగా సరుకులను తీసుకొంటున్నారో, ఆ దుకాణం నడిపే అతను, ఇక మీకు సరుకులు ఇవ్వటం కుదరదు, ఇప్పటికే 10,000 రూపాయలు అప్పున్నారు. అది చెల్లించిన తరువాతే సరుకులు ఇస్తాను అన్నాడట' అని చెప్పారు. అది విన్న సుబ్బారావు గారు ఆ దుకాణానికి వెళ్లి 10,000 రూపాయల అప్పును తీర్చివేసి ఆ కుటుంబం వారు ఏఏ సరుకులు ప్రతినెలా తీసుకొంటారో ఖాతాను చూసి తెలుసుకొని, ఆ సరుకులన్నింటినీ కట్టించి, ఒక రిక్షా మాట్లాడి ఆ సరుకులు వారికి అందే విధంగా చేశారు. అది కూడా ఆ కుటుంబం వారికి తెలియకుండా. అదీ వారి యొక్క ఔదార్యం. వారెటువంటివారో తెలియటానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. (సశేషం)

## “I am Nobody’s *Guru*”

Dr K Subrahmanian

*yat purvam sruti para darshi dhishano dvaipayano dhyaruhat*
*paschaat bodhakala vidhuta timirah shankaa paha shankarah*
*tat sampratyakhilavaneetala jushaam acharya simhasanam*
*devatvaam prativeekshate naratano geervaana sena pate*

Kavyakantha Ganapati Muni says,

*yat purvam sruti para darshi dhishano dvaipayano dhyaruhat*

Our *adi guru* was Vyasa, and that is why g*uru purnima* is also called *Vyasa purnima*. Vyasa wrote the *Itihasa*, the *Puranas*, and also divided the one *Veda* into four. He did all this out of compassion for us; so, out of gratitude for him, we celebrate this day, and pay our respects to him. Kavyakantha says he is our *Veda guru.*

*paschaat bodhakala vidhuta timira shankapahashankarah*

After Vyasa, Kavyakantha recognises only Adi Shankara as his *guru.* It is difficult to find another *guru* of the stature of Vyasa. According to Kavyakantha, if there is anyone, it is Shankara, for he cleared all our doubts.

*shruti smriti puranam alayam karunalayam (namami Bhagavadpada Shankaram Lokashankaram*

Shankara, who was an *avatar*, lived for only 32 years. Shankara literally means ‘one who does good for other

people'. Adi Shankara was a treasure house of the *Vedas*, the *Puranas*, and of all knowledge, and his main job was to clear the doubts of people.

*tatsampratyakhilavanee tala jushaam acharya simhasanam*

Kavyakantha says that after Shankara, however, there was no one to occupy the *acharya peetha*. It remained vacant till a person of Bhagavan's stature occupied it. This shows the extraordinary reverence that Kavyakantha had for Bhagavan.

On g*uru purnima*, we must think of all the *gurus*. Each one has his own *guru*, and we all get a *guru* by the grace of the Lord. We cannot choose a *guru;* the *guru* chooses us. Those who have come under the influence of Bhagavan will not say that one *guru* is greater or inferior to another *guru*. If we are all here today participating in *guru purnima*, it is because of the grace of Bhagavan.

We all look to Bhagavan and pray for his grace. From time to time, we realise that even this prayer is due to his grace. Bhagavan said, "I am nobody's *guru*, and nobody is my disciple." There are two reasons why he said this. If I consider you my *sishya*, and you consider me your *guru*, then we are two individuals. The *guru* considers the *sishya* a separate entity. The *guru* identifies himself as the body, and the *sishya* considers himself as the body. The question of doing something for the *sishya* arises only if I consider myself being very different from the *sishya*. We, at our level, cannot easily understand Bhagavan. All that we say about Bhagavan is true, but whatever we say is not the

